సాక్షి
నిర్మల్
మంగళవారం । 17 । జనవరి । 2023



పచ్చబంగారానికి దుంపతెగులు

జిల్లాలో పసుపువంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. మొలకదశ దాటిన తర్వాత వర్షాలు కురియడంతో పంటకు దుంపపుచ్చు, కుళ్లుతెగులు సోకుతున్నాయి. 9లో▸

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యపోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ దేవేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఒప్పంద (కాంట్రాక్టు) పద్ధతిలో గైనకాలజిస్ట్ (3), అనస్తేటిస్ట్ (1), పిడియాట్రిషన్ (2), డెంటల్ అసిస్టెంట్ సర్జన్ (1), సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్)1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 18న ఉదయం 10:30 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లో అందజేయాలన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1/15.3

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉదయం పొగ మంచు అధికంగా కురుస్తుంది. చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

సర్వం సన్నద్ధం

- 'కంటి వెలుగు'కు ఏర్పాట్లు పూర్తి
- 32 బృందాలు పరీక్షలు చేసేలా ఏర్పాట్లు
- 5.47 లక్షల మందికి పైగా పరీక్షలు
- ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

మొదటి విడతలో ఇలా..

జిల్లా జనాభా	7.08 లక్షలు
పథకం ప్రారంభం	2018, ఆగస్టు 15
పథకం ముగింపు	2019, ఫిబ్రవరి 28
పరీక్షలు చేయించుకున్న వారిసంఖ్య	3,75,859
దగ్గర చూపు అద్దాలు తీసుకున్న వారు	:62,342
దూరం చూపు అద్దాలు తీసుకున్న వారు	53,919
ఆపరేషన్‌కు గుర్తించిన వారి సంఖ్య	29,284
ఆపరేషన్ చేయించుకున్న వారి సంఖ్య	13,145



కంటివెలుగు సామగ్రి పంపిణీ చేస్తున్న కలెక్టర్

రెండవ విడతలో ఇలా...

జిల్లా జనాభా	7,94,548
18 సంవత్సరాలు పైబడిన వారు	5,47,000
మున్సిపల్ వార్డులు	80
గ్రామ పంచాయతీలు	396
మున్సిపల్ పరిధిలో టీంలు	8
గ్రామాల పరిధిలో టీంలు	24
జిల్లాకు చేరిన రీడింగ్ అద్దాలు	30,800

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణలో కంటిచూపు సమస్యతో ఏ ఒక్కరూ బాధపడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు రెండో విడత కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి విడత అనుభవంతో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధమయ్యారు. జనవరి 18న షురూ కానున్న పరీక్షలు 100 రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ మేరకు జిల్లాలోని 396 గ్రామ పంచాయతీలు, 80 మున్సిపల్ వార్డుల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయనున్నారు. గ్రామస్థాయి నుంచి శిబిరాలు ఏర్పాటు చేయాల్సిన స్థలాలు గుర్తించిన అధికారులు ఆయా కేంద్రాల్లో ముందస్తుగా డెమో నిర్వహిస్తున్నారు.

రెండు నుంచి వారంరోజుల పాటు..

రెండో విడత కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 5.47 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందుకు 32 బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి 100 రోజుల్లో కార్యక్రమం పూర్తి చేసేలా ప్రణాళికలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 23, పట్టణ ప్రాంతాల్లో 8 బృందాలు పనిచేయనున్నాయి. ఒక్కో బృందంలో ఒక వైద్యాధికారి, ఆప్టోమెట్రిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, పర్యవేక్షకులు, ఆయా గ్రామాల పరిధిలోని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఉంటారు. ఒక్కోచోట రెండు రోజుల నుంచి వారం రోజుల పాటు శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ముందస్తుగా సిబ్బంది ద్వారా కరపత్రాలను పంపిణీ చేసి శిబిరాలకు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిబిరాల్లో పరీక్షలు చేయనున్నారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ పరీక్షించి కంటి సంబంధిత వ్యాధులు ఏమున్నాయో చూస్తారు. బీపీ, మధుమేహం కారణంగా కంటిలో మార్పులను పరిశీలిస్తారు. దృష్టి లోపం ఉన్న వారికి అక్కడే కళ్ల అద్దాలు పంపిణీ చేస్తారు. ప్రత్యేకమైన అద్దాలు అవసరమున్న వారికి (ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్) ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తారు. రెండు వారాల్లో సదరు వ్యక్తి ఇంటికి నేరుగా వాటిని చేర్చనున్నారు.

ఐదు రకాల కంటి అద్దాలు

రెండో విడత కంటివెలుగు కార్యక్రమం కోసం కంటి అద్దాలు వచ్చాయి. జిల్లాకు మొదటి విడతలో భాగంగా ప్రభుత్వం ఇప్పటి వరకు 40,800 కంటి అద్దాలను డీఎంహెచ్ఓ కార్యాలయానికి సరఫరా చేసింది. వీటిలో ఐదు రకాలు వచ్చాయి. అవి 1.00, 1.50, 2.00, 2.50, 3.00 రకం ఉన్నాయి. విడతల వారీగా అవసరమైన కళ్లద్దాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

విజయవంతం చేస్తాం



జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి అన్నిరకాల ఏర్పాట్లు పూర్తిచేశాం. పరీక్షలు చేయడానికి 32 బృందాలను ఏర్పాటు చేసి వారికి విధులపై అవగాహన కల్పించాం. జిల్లాలో 5.47 లక్షల మందిని పరీక్షించనున్నాం. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులందరి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – ధన్‌రాజ్, డీఎంహెచ్‌వో

యాక్షన్ ప్లాన్ అమలు..

జిల్లాలో తొలివిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 2018 ఆగస్టు 15న ప్రారంభించగా 100 రోజుల పాటు శిబిరాలు కొనసాగాయి. జిల్లా ప్రజలకు పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. కానీ చాలా మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సి ఉండగా దాటవేశారనే విమర్శలు వచ్చాయి. కాగా ఈ సారి యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శని, ఆదివారం మినహా ప్రతీరోజు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో శిబిరంలో 300 మందికి, పట్టణ ప్రాంతాల్లో 400 మందికి కంటిపరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు తయారు చేశారు. ప్రతీరోజు జిల్లా వ్యాప్తంగా 15 వేలకు పైగా పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. స్క్రీనింగ్ తర్వాత మందులు, అవసరం ఉన్న వారికి అప్పటికప్పుడే కంటిఅద్దాలు అందిస్తారు. చూపులో ఏమైనా తేడా ఉంటే ఆటో రిఫ్రాక్టర్ మిషన్ ద్వారా పరీక్షిస్తారు. ప్రత్యేక కళ్లద్దాలు కావాల్సిన వారికి తయారు చేయించి ఇస్తారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు.

కంటివెలుగు పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి సోమవారం కంటి వెలుగు శిబిరాల నిర్వహణపై అన్నిజిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న సీఎం కేసీఆర్ ఖమ్మంలో కంటివెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. జిల్లాల్లో జనవరి 19న ఉదయం 9.00 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసన మండలి సభ్యులు, జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ, సర్పంచులు వారి పరిధిలో కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రతీ బృందం సకాలంలో క్యాంపులు ప్రారంభించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయా బృందాలు ఉదయం 8:45 నిమిషాల వరకు తప్పనిసరిగా క్యాంపు లొకేషన్‌కు చేరుకోవాలన్నారు. కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఆర్పీలు, వీవోఏలను భాగస్వామ్యం చేయాలన్నారు. క్యాంపు నిర్వహణ ముందస్తు సమాచారం ప్రజలకు తెలియజేయాలన్నారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ మాట్లాడుతూ కంటి వెలుగు క్యాంపుల నిర్వహణకు సంబంధించి అన్నిఏర్పాట్లు చేశామన్నారు. మొదటి విడత జిల్లాకు 30,080 కళ్లద్దాలు అందాయన్నారు. కార్యక్రమంలో డీఎంఈ రమేశ్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీపీవో శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

కడెం(ఖానాపూర్): గతేడాది కడెం ప్రాజెక్టుకు వచ్చిన భారీ వరదలతో భూములు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వరదల కారణంగా భూములు కోతలకు గురై పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి భూములను సర్వేచేసి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజు, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సర్దార్, ఐఎఫ్‌టీయూ నాయకులు సునారికారి రాజేశ్, వెంకటేశ్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కిరణ్మయి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ కిరణ్మయి సూచించారు. సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 14 విజ్ఞప్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిష్కారంకాని సమస్యలు ప్రజావాణిలో పరిష్కారం అవుతాయని ఎంతో నమ్మకంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమగోడు చెప్పుకునేందుకు వస్తుంటారన్నారు. ప్రజల అర్జీలను పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఎంఈ శ్రీనివాస్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో నూతనంగా చేపడుతున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వీలైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. మెడికల్ కళాశాల ఏర్పాటు ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు అందుతాయన్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీడీఎంహెచ్‌వో రాజేందర్, సీనియర్ వైద్యులు సురేశ్ ఉన్నారు.



ఆప్యాయ పలకరింపు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చిన సీడీఎంఏ సత్యనారాయణ సోమవారం గొల్లపేటలోని శిబిరాన్ని సందర్శించారు. పేరు నమోదు చేసుకోవడానికి వచ్చిన వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ఆలింగనం చేసుకున్నారు. అవ్వా ఎట్లున్నవ్.. నీ కంటిచూపు ఎలా ఉంది.. అంటూ పలకరించారు. ఇతనెవరో మీకు తెలుసా అంటూ కలెక్టర్‌ను వారికి పరిచయం చేశారు. ఆ దృశ్యాలను 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

గిన్నిస్ బుక్ రికార్డు లక్ష్యంగా పనిచేయాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించేలా కృషి చేద్దామని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఎల్లపల్లిలో కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ, సీడీఎంఏ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషనల్ రమేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డెమో కార్యక్రమంలో కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జనవరి 19న ఉదయం 9.00 గంటలకు ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు తమవెంట ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో మెడికల్ సిబ్బందికి ఎలాంటి లోటుపాట్లు జరగకుండా తగిన వసతులు కల్పించాలన్నారు. అంతా సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం గొల్లపేట్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఉన్నతాధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాస్ మీడియా అధికారి రవీందర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మంత్రి అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్‌లో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించిన తైక్వాండో సౌత్ ఇండియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం తమ నివాసంలో అభినందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గెలుపొందిన విద్యార్థులు మంత్రిని కలిశారు. ఈ కార్యక్రమంలో తేజందర్ సింగ్ భాటియా, అమ్ముల భూషణ్, శ్రీకాంత్, గోనుగప్పుల రాజశేఖర్, వంశీ, దీపిక, పూనమ్, నరేష్, కరాటే అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ చుక్క ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా క్రీడాప్రాంగణాలు!



ఈ చిత్రంలో కనిపిస్తోంది భైంసా పట్టణంలోని కుంట ప్రాంతంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం. స్థలం కొరత కారణంగా ఇలా నామమాత్రంగా ఏర్పాటు చేసి వదిలేశారు. మైదానం కోసం గ్రావెల్ వేసినట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో చూస్తే పరిస్థితి ఇలా ఉంది. ఇప్పటికే ఇక్కడ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినా నిర్వహణ మర్చిపోవడంతో జిమ్ పరికరాలను కొందరు ఎత్తుకుపోయారు. ప్రస్తుతం ఇది నిరుపయోగంగా మారింది. ఇప్పుడు క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసినా ఆటలాడేందుకు అనువుగా లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు.

- లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం
- మున్సిపాలిటీల్లో అస్తవ్యస్తంగా ఏర్పాట్లు
- స్థలాల కొరత, అరకొర వసతులతో ఆదరణకు నోచుకోని వైనం

భైంసాటౌన్(ముధోల్): లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు కొన్నిచోట్ల నిరుపయోగంగా మారుతున్నాయి. పట్టణాల్లో వార్డుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉండగా స్థలాల కొరతతో నాలుగువార్డులకు కలిపి ఒకటి ఏర్పాటు చేశారు. తప్పనిసరిగా క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడం.. క్షేత్రస్థాయిలో సరైన స్థలాలు లేకపోవడంతో అధికారులు నామమాత్రంగా ఏర్పాటు చేసి వదిలేశారు. ఫలితంగా ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన ప్రాంగణాలు ఉపయోగంలోకి రాకుండా పోతున్నాయి. ప్రభుత్వం సదుద్దేశంతోనే ఏర్పాటుకు నిర్ణయించినా క్షేత్రస్థాయిలో అరకొర వసతుల కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు.



జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో క్రీడాప్రాంగణం పరిస్థితి ఇలా...

జిల్లాలోని క్రీడాప్రాంగణాలకు వెచ్చించిన నిధులు

పట్టణం	క్రీడాప్రాంగణాలు	నిధులు (రూ.ల్లో)
నిర్మల్	10	30 లక్షలు
భైంసా	6	8 లక్షలు
ఖానాపూర్	3	2.75 లక్షలు

నాలుగు వార్డులకు కలిపి...

ప్రతి మున్సిపాలిటీలో వార్డుకు ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం స్థలాల కొరత నేపథ్యంలో నాలుగు వార్డులకు కలిపి ఒక క్రీడాప్రాంగణం ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మూడు మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం 80 వార్డులుండగా నిర్మల్‌లో 10, భైంసాలో 6, ఖానాపూర్‌లో 3 క్రీడాప్రాంగణాలు మాత్రమే ఏర్పాటు చేశారు. అవికూడా సరైన వసతులు లేకుండా మమ అనిపించారు.

సరైన వసతులేవి?

ప్రతీ వార్డులో ఎకరా విస్తీర్ణంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మేరకు ప్రతీ ప్రాంగణంలో ఆటలాడేందుకు అనువుగా మైదానం చదును చేయించడం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులు ఏర్పాటు చేయించడం, వాటి చుట్టూ మొక్కలు నాటించడం, వ్యాయామ పరికరాల ఏర్పాటు చేయాలి. కానీ చాలా చోట్ల స్థలాల కొరత ఉండడంతో పాఠశాలల మైదానాలు, ఇతర ఖాళీ స్థలాల్లో తెలంగాణ క్రీడాప్రాంగణం అంటూ బోర్డు, వాలీబాల్ కోర్టు, వ్యాయామం చేసేందుకు ఇనుప బార్‌లు ఏర్పాటు చేసి వదిలేశారు. స్థలాలు సైతం చదును లేకపోవడంతో ఆటలాడేందుకు అనువుగా లేవు. దీంతో క్రీడాకారులు ఇటువైపు చూసే పరిస్థితి లేకుండా పోయింది.

బదిలీలకు వేళాయె!

- టీచర్ల ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్లకు గ్రీన్ సిగ్నల్
- రెండు రోజుల్లో నోటిఫికేషన్
- జిల్లాలో 474 మంది ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరే అవకాశం
- వచ్చే విద్యా సంవత్సరంలో పోస్టింగ్
- కోర్టులో పండిట్, పీఈటీల అప్‌గ్రేడ్ అంశం



జిల్లా వివరాలు

పోస్టులు	ఖాళీలు
స్కూల్ అసిస్టెంట్లు	169
పీజీహెచ్ఎంలు	59
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు(అప్‌గ్రేడ్ చేస్తే)	35
పండిత్‌లు(అప్‌గ్రేడ్ చేస్తే)	211
మొత్తం	474

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు నివాసంలో సంక్రాంతి పర్వదినాన ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో ఈ మేరకు సబితా ఇంద్రారెడ్డి ప్రకటన చేశారు. మరో రెండు రోజుల్లో షెడ్యూల్ ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లకోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు సంక్రాంతి పండుగ రోజున తీపి కబురు అందింది.

ఉపాధ్యాయులకు లబ్ధి

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు రానున్నాయి. జిల్లాలో 228 మందికి లబ్ధి చేకూరనుంది. పండిత్, పీఈటీ పోస్టుల ఉన్నతీకరణ అంశం హైకోర్టులో ఉంది. ఒకవేళ వారికి కూడా ప్రభుత్వం ప్రమోషన్లు ఇస్తే మరో 246 మంది పెరిగి మొత్తంగా 474 మందికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఇందులో పీజీహెచ్ఎం పోస్టులు 59,ఎ స్కూల్ అసిస్టెంట్ గణితం (తె.మీ) 8, (ఇ.మీ) 2, మరాఠీ మీడియం 1, ఫిజికల్ సైన్స్ (తె.మీ) 5 (ఇ.మీ) 1, మరాఠీ మీడియం 1, బయో సైన్స్ (తె.మీ) 21, (ఇ.మీ)1, మరాఠీ 2, సోషల్ స్టడీస్ (తె.మీ) 45 (ఇ.మీ) 5, మరాఠీ 3, తెలుగు 9, హిందీ 9, ఇంగ్లిష్ 1, ఉర్దూ 4, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (తె.మీ)1, పీఎస్ హెచ్ఎం (తె.మీ)48, మరాఠీ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటినీ సీనియారిటీ ప్రకారం వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ప్రమోషన్లు చేపడతారు.

ఉపాధ్యాయవర్గాల్లో ఆనందం

ప్రభుత్వం ఎట్టకేలకూ ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లకు షెడ్యూల్ ప్రకటించనుండడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందం నెలకొంది. ఏడేళ్లుగా పదోన్నతులు, నాలుగేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు నలిగిపోతున్నారు. కిందిస్థాయిలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాల నాయకులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. ఇటీవల తమ సంఘ సభ్యత్వం కోసం పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తీవ్ర నిరసన సైతం ఎదురైంది. ఇదిలా ఉండగా మార్చిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ కోసమే ప్రభుత్వం ఈ ప్రమోషన్ల స్టంట్ తీసుకుందని ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అంతేకాకుండా జీవో 317 ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈసారి బదిలీలు, ప్రమోషన్లలో వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

కోర్టు పరిధిలో పండిత్, పీఈటీ పోస్టుల ఉన్నతీకరణ అంశం

2009 ప్రపంచ తెలుగు మహాసభల్లో పండిత, పీఈటీ పోస్టులను ఉన్నతీకరిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం మూడుసార్లు జీవోలు కూడా విడుదల చేసింది. కానీ కొందరు ఎస్జీటీలు తమకు న్యాయం చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. తీర్పు ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. దీంతో ఇప్పుడు జరిగే ప్రమోషన్లలో పండిత, పీఈటీలకు న్యాయం జరుగుతుందా? లేదా? అనేదానిపై ఉత్కంఠ ఏర్పడింది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ ప్రభుత్వం బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ త్వరగా విడుదల చేసి ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సిద్ధంగా ఉన్నాం..



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రకియ చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే జిల్లాలో ఉన్న ఖాళీల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ప్రక్రియ నిర్వహిస్తాం. ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయగానే దానికి అనుగుణంగా నడుచుకుంటాం.
– రవీందర్‌రెడ్డి, డీఈవో

క్లుప్తంగా

లారీ బోల్తా

- బ్రేక్ ఫెయిల్ కావడంతో టోల్‌ప్లాజా వద్ద ఘటన
- తప్పిన ప్రమాదం



రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద బోల్తాపడ్డ లారీ

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద సోమవారం లారీ బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. బెంగుళూరు నుంచి ఉత్తరప్రదేశ్ వైపు వెళ్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో టోల్‌ప్లాజా పక్కన పల్టీ కొట్టింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం చోటుచేసుకోలేదు. టోల్‌ప్లాజా ఉద్యోగులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

గోదావరిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

బాసర(ముథోల్): బాసర గోదావరి నదిలో సోమవారం గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆమె వయస్సు సుమారు 55 సంవత్సరాల వరకు ఉంటుందని, ఇతర ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు.

కొండ చిలువ హతం



హతమైన కొండ చిలువ

ముథోల్: మండల కేంద్రంలోని కంటి ఆస్పత్రి ఎదుట భైంసా–బాసర వెళ్లే మార్గంలో సోమవారం కొండచిలువను హతమార్చారు. 9 అడుగుల పొడవున్న కొండ చిలువ రోడ్డుపైకి రావడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. అందులో కొందరు ముందుకు వచ్చి కొండ చిలువను హతమార్చారు.

చోరీకి యత్నం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో గల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చొరబడి చోరీకి ప్రయత్నిస్తుండగా పట్టుబడ్డారు. చోరీకి పాల్పడుతున్న గుర్తు తెలియని ఇద్దరి వ్యక్తులను గమనించిన అసోసియేషన్ భవన మేనేజర్ చెట్టిపల్లి గట్టయ్య వెంటనే తేరుకుని స్థానికులకు సమాచారం అందించి అప్రమత్తమయ్యాడు. దొంగలు రెండు ఏసీలు తీసి ఉంచడంతో హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌కు కూడా సమాచారం ఇచ్చాడు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిన దొంగలను బయటకు రాకుండా తలుపులు వేసి లోపలే బంధించారు. సమాచారం అందుకున్న ఎస్సై ఉదయ్‌కిరణ్ అసోసియేషన్‌కు చేరుకుని అప్పటికే పట్టుకుని ఉన్న దొంగలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సింగరేణిలో ట్రాన్స్‌ఫర్ పాలిటిక్స్!



ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేస్తున్న నాయకులు

- ఆర్కేపీ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ
- వచ్చే ఎన్నికల్లో చెన్నూర్ నుంచి పోటీచేసే అవకాశం
- బదిలీ వెనుక రాజకీయ కోణం ఉందని విమర్శలు

రామకృష్ణాపూర్: సింగరేణిలో రాజకీయం జోక్యం రోజురోజుకూ పెరుగుతోందా అంటే అవుననే అంటున్నాయి కార్మిక సంఘాలు. ఇప్పటికే అధికారిక కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని యాజమాన్యం ఆదేశించింది. ఇదే అదునుగా సంస్థ విస్తరించి ఉన్న జిల్లాలు, నియోజకవర్గాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సంస్థ కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటున్నారు. క్వార్టర్ల కేటాయింపు, బదిలీలను ప్రభావితం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను రెండ్రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా ఎల్లందుకు బదిలీ చేయడం వెనుక రాజకీయ జోక్యం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాపతినిధి ఒత్తిడితో ఉన్నతాధికారులు బదిలీ చేశారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

మూడేళ్లుగా విధి నిర్వహణ..
2019 జూన్‌లో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో రాజరామేశ్ విధుల్లో చేరారు. కోవిడ్ విజృంభించిన సమయంలో కొందరు వైద్యులు సెలవుపై వెళ్లినప్పటికీ రాజరమేష్ లీవు పెట్టకుండా అత్యుత్తమ వైద్య సేవలందించి సంస్థ ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయన విధి నిర్వహణలో చిత్తశుద్ధి ప్రదర్శించటమే కాకుండా పలు సేవా కార్యక్రమాలతో ప్రజల్లో తనదైన ముద్ర వేసుకున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.

రాజకీయాల్లోకి వస్తాడన్న అనుమానంతోనే..
డాక్టర్ రాజరమేశ్ త్వరలో రాజకీయ అరంగేట్రం చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీలోకి వెళ్తారనేది ఇంకా స్పష్టత లేకపోయినప్పటికీ ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీతో రాజరమేశ్‌కు సత్సంబంధాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల రాజరమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ మహోత్సవంలో కూడా ఆ మాజీ ఎంపీ పాల్గొనటం చర్చానీయాంశమైంది. ఎస్సీ వర్గానికి చెందిన రాజరమేశ్ రాజకీయాల్లోకి వచ్చి.. చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఏదైనా పార్టీ నుండి బరిలోకి దిగితే కచ్చితంగా తమకు బలమైన ప్రత్యర్థి అవుతారన్న ఉద్దేశ్యంతో అధికార పార్టీ నాయకులే బదిలీ చేయించారని విపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. బదిలీ నిలిపివేయని పక్షంలో లాంగ్‌లీవ్ పెట్టి మరింతగా ప్రజలకు చేరువై ఎన్నికల సమయానికి అధికార పార్టీకి దీటుగా నిలిచే ఏదైనా ఓ పార్టీలో చేరి చెన్నూర్ అసెంబ్లీ బరిలో పోటీ చేసే అవకాశలున్నాయని అంటున్నారు. ఏదేమైనా రాజరమేశ్ పొలిటికల్ ఎంట్రీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

బదిలీ నిలిపివేయాలని ఆందోళన



స్వచ్ఛందంగా మూసివేసిన దుకాణాలు

రామకృష్ణాపూర్: సింగరేణి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను ఆకస్మికంగా బదిలీ చేయడంపై విపక్ష నాయకులు ఆదివారం స్థానిక కోల్‌బెల్ట్ రహదారిపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రాజరమేశ్ కోవిడ్ విజృంభిస్తున్న సమయంలో ప్రాణాలకు తెగించి సెలవులు పెట్టకుండా విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. తన సోదరి పేరిట జీఎస్ఆర్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులే బదిలీ చేయించారని ఆరోపించారు. వెంటనే బదిలీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బదిలీని నిరసిస్తూ సోమవారం పట్టణ బంద్ నిర్వహించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. దుకాణాలు మూసివేసి డాక్టర్ బదిలీ నిలిపివేయాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొన్నాల సాగర్, నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, పాలరాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు...
ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో డాక్టర్ రాజరమేశ్ తన సోదరి పేరిట జీఎస్ఆర్(గొడిసెల సురేఖరాజ్) ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. దానిద్వారా ఆపదలో ఉన్న వారికి, అనాథలకు చేయూతనందిస్తున్నారు. పలువురికి ఆర్థిక సహాయం కూడా చేశారు.ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి బదిలీ చేయటంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ విధుల్లో చేరి మూడేళ్ల అవుతున్నా ఆకస్మాత్తుగా బదిలీ చేయటంపై సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు, విపక్ష పార్టీల నేతలు మండిపడుతున్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏరియా నాయకులు పోచం, శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 29న భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించే సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏడో రాష్ట్ర మహాసభల పోస్టర్ సోమవారం గోలేటిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను ఐక్యం చేసి, యూనియన్ కార్మికుల హక్కులు, వేతనాల కోసం పోరాటాలు చేస్తోందన్నారు. పోరాటాల ఫలితంగానే కనీస వేతనం, పీఎఫ్, ఆసుపత్రి, పనిభద్రత, బోనస్‌లాంటి అనేక హక్కులు సాధించుకున్నామని పే ర్కొన్నారు. అదే తరహాలో ఒకటో కేటగిరి వేతనం, పర్మినెంట్, గ్రాట్యూటీ వంటి సమస్యలను 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో ప్ర ధాన ఎజెండాగా పెట్టి చర్చించాలని డి మాండ్ చేస్తూ ఉద్యమాలు చేపట్టామన్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూ పొందించటంతోపాటు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు సికిందర్, బాపు, సావిత్రి, పోసుబాయి, పోశం, గోపాల్, రాణి, తార, నాగలక్ష్మి, భీమేశ్ పాల్గొన్నారు.

పంటలకు నీరందించాలని రైతుల రాస్తారోకో

లక్సెట్టిపేట: కడెం చివరి ఆయకట్టు వరకు ఉన్న దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల వరి పొలాలకు యాసంగి పంటకు నీరందించాలని మండలాల్లోని రైతులు ఆదివారం సంక్రాంతి పండగ రోజున స్థానిక అంబేద్కర్ చౌరాస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మండలాలకు రెండు పంటలకు నీరందించేలా చూడాలని, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు వచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో శాంతించారు. జలసాధనసమితి నాయకులు నైనాల గోవర్ధన్, రైతులు పాల్గొన్నారు.

కలప అక్రమంగా తరలిస్తే పీడీయాక్ట్



మాట్లాడుతున్న ఎఫ్‌డీవో బర్నోబా



స్వాధీనం చేసుకున్న కలప దుంగలు

- ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా

నేరడిగొండ: కలప అక్రమంగా తరలించే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా అన్నారు. మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోరిగాం శివారు అటవీ ప్రాంతంలో టేకు చెట్లను నరికి రెండు వాహనాల్లో 19 కలప దుంగలను అక్రమంగా తరలిస్తుండగా ఎఫ్ఆర్వో గణేశ్ ఆ ధ్వర్యంలో పట్టుకున్నామన్నారు. నిందితులు నిజామాబాద్‌కు చెందిన వారిగా గుర్తించి, జావిద్ ఖాన్, మిర్జా మహెబూబ్, షేక్ అఫ్రోజ్, షేక్ షఫీఉద్దీన్, పఠాన్‌ఖాన్‌ను అరెస్టు చేశామన్నారు. సుల్తాన్ ప రారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ముల్తానీల సహాయంతో కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలిపారు. రెండు వాహనాలను సీజ్ చేయగా, పట్టుకున్న కలప విలువ రూ.2లక్షల పైగా ఉంటుందని పేర్కొన్నారు. దాడి చేసి కలప పట్టుకున్న ఎఫ్ఆర్వోతో పాటు సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు, మేక మృతి



మృతి చెందిన గొర్రెలు

లక్ష్మణచాంద(నిర్మల్): కుక్కల దాడిలో 20 గొర్రెలు, మేక మృతి చెందిన సంఘటన మండలంలోని చింతల్‌చాందలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నారికట్ల చిన్నయ్య ఇంటివద్ద కొట్టంలో గొర్రెలు, మేకలను ఉంచాడు. ఆదివారం రాత్రి కుక్కలు కొట్టంలోకి ప్రవేశించి వాటిపై దాడి చేశాయి. ఇందులో 20 గొర్రెలు, మేక మృతి చెందాయి. బతుకుదెరువుకోసం గతంలో గల్ఫ్ దేశానికి వెళ్లిన చిన్నయ్య అక్కడ కంపెనీ సరిగా లేకపోవడంతో చేసిన అప్పులు తీరకుండానే ఇంటికి తిరిగి వచ్చాడు. గ్రామంలో ఇతరుల గొర్రెలు, మేకలు మేపుతున్నాడు. ఆదివారం నాటి ఘటనలో రూ.2లక్షల 30 వేల వరకు నష్టపోయానని బాధితుడు వాపోతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ముగిసిన నానూమహరాజ్ జాతర



జాతరలో భక్తుల సందడి



కుస్తీ పోటీలో తలపడుతున్న వస్తాదులు

సారంగపూర్(నిర్మల్): నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని బండరేవు తండాలో ఐదురోజులుగా కొనసాగుతున్న నానూ మహారాజ్ జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వివిధ గ్రామాలకు చెందిన వేలాదిమంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు నిర్వహించిన కుస్తీపోటీలు ఆహూతులను అలరించాయి. మహారాష్ట్ర, కుభీర్ తదితర ప్రాంతాలకు చెందిన వస్తాదులు కుస్తీపోటీల్లో పాల్గొన్నారు. జాతరకు ప్రధాన ఆకర్షణగా కుస్తీపోటీలు నిలిచాయి. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ అధ్యక్షుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఆర్టీఏ అజ్మీరా శ్యామ్‌నాయక్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విలాస్, రాంశంకర్‌రెడ్డి, తదితరులు సందర్శించారు. సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో కౌఠ(బి) యువకుడు



కేంద్రమంత్రితో సోమేశ్వర్

బోథ్: బెంగుళూరులో జరుగుతున్న నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో బోథ్ మండలంలోని కౌఠ (బి) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్ పాల్గొన్నారు. గత ఐదు రోజులుగా ఫెస్టివల్ కొనసాగుతోంది. కర్ణాటక సీఎం బసవరాజు బొమ్మైతోపాటు పార్లమెంట్ వ్యవహారాల, బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. కాగా, తెలంగాణ నుంచి 10 మంది యువకులు పాల్గొనగా, అందులో సోమేశ్వర్ ఒకరు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దంపతులిద్దరు సోమవారం ఆత్మహత్యకు యత్నించారు. భార్యభర్తలకు మధ్య గొడవ జరగగా, స్పిరిట్ తాగి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ప్రస్తుతం వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి కుదుటగానే ఉందని వైద్యులు తెలిపారు.

ప్రైవేట్ డెయిరీ నిర్వాహకులకు రిమాండ్

బెల్లంపల్లి: డెయిరీ నిర్వహణ పేరుతో బెల్లంపల్లి ప్రాంత రైతుల వద్ద రూ.లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా సంతమగులూరు మండలం చౌటుపాలెం గ్రామానికి చెందిన కందిమల్ల ఆదినారాయణ అలియాస్ హరిబాబు అలియాస్ హరికిషన్, అనంతపురం జిల్లా గంగవరం గ్రామానికి చెందిన బోయపాటి షేజల్ అలియాస్ నందినిని ఈ నెల 13వ తేదీన బెల్లంపల్లిలో అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఇన్‌చార్జి డీసీపీ అఖిల్ మహాజన్ ప్రకటించారు. ఆ నిందితులను మరుసటి రోజు 14వ తేదీ శుక్రవారం చెన్నూర్ కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టారు. సదరు నిందితులను న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించడంతో ఆదిలాబాద్ జిల్లా జైలుకు పోలీసులు తరలించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఈనెల 21న ప్రారంభం కానున్న నాగోబా జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మంగళవారం మెస్రం వంశీయులు వడమరకు పవిత్ర గంగాజలాలతో చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ భీంరావ్, ఏపీవో పీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, హెచ్‌వో సుధీర్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి వద్దకు వెళ్లి..
తనకు మూడు చక్రాల స్కూటీ మంజూరుతోపాటు స్థానికంగా నివాసం ఉండేందుకు ఐటీడీఏ క్వార్టర్ ఇప్పించాలని దివ్యాంగురాలు గడ్డం భీంబాయి అర్జీ పెట్టుకునేందుకు ఐటీడీఏకు చేరుకుంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమె వద్దకు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి నేరుగా వెళ్లి అర్జీ స్వీకరించారు. ఆమెకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



దివ్యాంగురాలి వద్దకు చేరుకుని అర్జీ స్వీకరిస్తున్న పీవో

అ'పూర్వ' సమ్మేళనం



2002-03 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు

లోకేశ్వరం(ముథోల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల క్రితం తాము పాఠశాలలో కలిసి చదువుకున్న జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ప్రధానోపాధ్యాయుడు మానిక్ కుమార్, ఉపాధ్యాయులు రవీందర్‌కుమార్, గంగన్న, అమృతం, రమణరావు, గంగాధర్, శ్రీధర్‌రెడ్డి, మల్లేశ్, సునీల్ కుమార్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధాకర్, రాజేశ్వర్, రమేశ్, అనిల్, భూమన్న, వియక్, నరేశ్, సుభాష్, లింగన్న, వినోద్, సుమలత, రజిత, పద్మ, మౌనిక, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండల కేంద్రంతోపాటు గొర్రెగుట్టలో కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారంతో మండల కేంద్రంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం దాడి చేసి రెండు పందెం కోళ్లు, రూ.2,000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మొర్లె తిరుపతి, బుర్రి రాములు, చింతపూడి పున్నం, పుల్గం స ంతోష్, గురిజాల వెంకన్న, వనపర్తి రాజు, జర్పుల కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గొర్రెగుట్టలో రెండు పందెం కోళ్లు, రూ.2,150 నగదు స్వాధీనం చేసుకు ని ఆరుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. శ్రీరాముల ఎల్లయ్య, బకాం రాము, బొక్క వెంకటేశ్వర్‌రావు, బొక్క కోటేశ్వర్‌రావు, దార లస్మయ్య, పస్తం బాలరాజుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

సిర్పూర్(టి): భూపాలపట్నం శివారులో శనివారం కోడి పందేల స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని పట్టుకుని, రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పారిగాం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న పది మందిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుల వద్ద రూ.13,030 నగదుతోపాటు నాలుగు పందెం కోళ్లు, మూడు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.